నమస్తే తెలంగాణ
ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, బుధవారం 28 ఆగస్టు 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలి

- ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి
- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- రామప్పకు శిల్పకళకు ఫిదా

ఆదివాసీలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రామప్పలో పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

ములుగు, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : ఆదివాసీ గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో కృషిచేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో పర్యటించారు. ఉదయం 11గంటలకు ములుగు ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకోగా మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరానికి చేరుకోగా, ఆదివాసీలు కొమ్ముకోయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్‌వర్మ జిల్లా స్థాయి అధికారులతో సమావేశం కాగా, జిల్లా ప్రగతిని కలెక్టర్‌తో పాటు మంత్రి సీతక్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి గవర్నర్ పలు సూచలు చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో గిరిజనులు అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఇతర వర్గాలకు ఆదర్శంగా నిలుస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు గిరిజనులు కృషి చేయాలని గవర్నర్ పేర్కొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలోని ప్రజలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారని అన్నా రు. ప్రతీ రెండేళ్లకోసారి అత్యంత వైభవంగా నిర్వహించే మేడారం సమ్మక్క-సారలమ్మల మహా జాతర ను జాతీయ పండుగగా గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. అనంతరం గవర్నర్ ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకొని ఇన్‌టాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రముఖ రచయిత రాచర్ల గణపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంబటి శ్రీజన్, రెజ్లింగ్ క్రీడాకారిణి చల్లా మౌనిక, జిమ్నాస్టిక్స్ క్రీడాకారిణి పీ రజిత, వాలీబాల్ క్రీడాకారుడు పాలడుగు వెంకటేశ్వర్‌రావు, ఎన్విరాన్‌మెంట్ సైంటిస్ట్ కాజంపురం దామోదర్, సోషల్ వర్కర్ కొమురం ప్రభాకర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, గణిత ఉపాధ్యాయుడు కందా రామయ్య తదితర కవులు, కళాకారులు, ఇతర రంగాల వారితో మమేకమ్యారు. అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎస్పీ శబరీష్ నేతృత్వంలో ఓఎస్డీ మహేశ్ బాబాసాహెబ్ గీతే పర్యవేక్షణలో 800మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గవర్నర్ వెంట ఆయన ప్రత్యేక కార్యదర్శి బుర్రా వెంకటేశం, జాయింట్ సెక్రటరీ జే భవానీశంకర్, భద్రత ఇన్‌చార్జి సిరిశెట్టి సంకీర్త్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, అదనపు ఎస్పీ సదానందం, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, డీఆర్డీవో సంపత్‌రావు, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పాల్గొన్నారు.

గణపురం : కోటగుళ్లలో గవర్నర్ పూజలు

అద్భుత కట్టడం రామప్ప

– కాకతీయుల వైభవాన్ని చాటే కోటగుళ్లు

వెంకటాపూర్/గణపురం : మహాద్భుతమైన కట్టడం రామప్ప అని, ఇంతటి శిల్పకళను ఎక్కడా చూడలేదని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం వెంకటాపురం మండలంలోని రామప్ప ఆలయం, భూపాలపల్లి జిల్లా గణపురంలోని కోటగుళ్లను మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, భూపాలపల్లి, భద్రాచలం ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, తెల్లం వెంకట్రావ్‌తో కలిసి సందర్శించారు. రామప్ప ఆలయ గార్డెన్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం దేవాదాయ శాఖ అధికారులుల, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామప్ప, కోటగుళ్లు ఆలయాల విశిష్టతను ప్రొఫెసర్ పాండురంగారావు, టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ అఫీసర్ కుసుమ సూర్యకిరణ్, వివరించారు. రామప్పలోని సరిగమల శిల్పాలు, నీటిలో తెలియాడే ఇటుకలను చూసి ఆశ్చర్యపోయారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించగా చెరువు విస్తీర్ణం, ఆయకట్టు, కెపాసిటీని ఇరిగేషన్ సీఈ విజయ్ భాస్కర్ వివరించారు.

పోలీసుల ఆంక్షలు.. ప్రజలకు ఇబ్బందులు

గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. బండారుపల్లి రోడ్డు, కలెక్టరేట్ వైపు దుకాణాలను అధికారులు మూసివేయించారు. కలెక్టరేట్‌కు వచ్చే రోడ్లలన్నింటినీ బారికేడ్లతో బ్లాక్ చేశారు. దీంతో సామాన్య ప్రజలు, వ్యాపారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గవర్నర్ జిల్లా కేంద్రానికి చేరుకునే గంట ముందు నుంచే జంగాలపల్లి, ప్రేమ్‌నగర్ పెట్రోల్ బంక్ యూటర్న్‌ల వద్ద వాహనాలను నిలిపివేశారు. దీంతో జంగాలపల్లి వద్ద ట్రాఫిక్ జామ్ కాగా, ప్రేమ్‌నగర్ పెట్రోల్ బంక్ వద్ద 108 వాహనం కొద్ది సేపు నిలిచిపోయింది. అలాగే కవరేజీ కోసం వెళ్లిన జర్నలిస్టులను కలెక్టరేట్ గేటు వద్దే నిలిపివేశారు. రామప్ప, లక్నవరంలో సైతం అనుమతించలేదు. కలెక్టరేట్‌లో గవర్నర్ గ్రీవెన్స్ సెల్‌కు ప్రజలను అనుమతించకపోవడంతో ఎవరి కోసం ఏర్పాటు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటగుళ్లలో ఎవరినీ అనుమతించలేదు. ఐడీ కార్డు ఉన్నప్పటికీ గణపురం కార్యదర్శి విజేందర్‌ను భూపాలపల్లి ఎస్సై-2 సంధ్య బయటకు పంపి అవమానించారు. వారం రోజులుగా ఆలయంలో సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించానని, ఇంకా చేయాల్సిన పనులున్నాయని చెప్పినా వినకపోవడంతో ఆయన అసహనంతో వెళ్లిపోయారు. అయితే ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్సైకి పలు పార్టీల నాయకులు లోపలికి వెళ్లడం కనిపించలేదా? అంటూ పలువురు చర్చించుకున్నారు.

లక్నవరంలో బస

వేలాడే వంతెనపై గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

గోవిందరావుపేట : లక్నవరం సరస్సును మంగళవారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మంత్రి సీతక్కతో కలిసి సందర్శించారు. మొదటి వేలాడే వంతెన మీదుగా నడుస్తూ కాకరకాయ బోడ్ దీవికి చేరుకున్నారు. అనంతరం పాన్‌టూన్ బోటులో 2వ ఐలాండ్‌కు చేరుకున్నారు. అంతకుముందు గవర్నర్‌కు లంబాడీ మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. రాత్రి 2వ ఐలాండ్‌లోని సమ్మక్క-సారక్క దీవిలో బస చేశారు. బుధవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అనంతరం తిరిగి హనుమకొండకు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా లక్నవరం చుట్టూ పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

• ఎల్ ఆర్ ఎస్ హెల్ప్ డెస్క్ ఖాళీ

విధులకు హాజరుకాని సిబ్బంది

నిరాశగా వెనుదిరుగుతున్న ప్రజలు

ఖాళీగా ఉన్న కలెక్టరేట్‌లోని హెల్ప్‌డెస్క్

హనుమకొండ, ఆగస్టు 27 : కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్ మంగళవారం ఖాళీగా దర్శనమిచ్చింది. సందేహాల నివృత్తి కోసం అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, సర్కిల్ ఆఫీసులతో పాటు కలెక్టరేట్‌లో వీటిని ఏర్పాటుచేశారు. అయితే హెల్ప్‌డెస్క్‌లో సిబ్బందిని నియమించకపోవడంతో అక్కడికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరగాల్సి వస్తున్నదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్‌లోకి వెళ్లి అడిగితే హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అక్కడే తెలుసుకోవాలని చెబుతున్నారని, ఇప్పటికైనా సిబ్బంది ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

జనగామ జిల్లా దేవరుప్పులలో బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

గిర్మాజీపేట : శివనగర్‌లో స్వీట్లు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

న్యాయం గెలిచింది..

ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై బీఆర్ఎస్ శ్రేణుల హర్షం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మిన్నంటిన సంబురం
- పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకొని ఆనందం
- ఎన్ని కుట్రలు చేసినా నిజం, న్యాయమే గెలిచిందన్న నేతలు

కాశిబుగ్గ : పైడిపల్లిలో స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

శివనగర్‌లో పటాకులు కాల్చుతున్న నన్నపునేని, కార్పొరేటర్లు, కార్యకర్తలు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. జైలు నుంచి విడుదలైన సందర్భాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు, నాయకులు ఆనందం వ్యక్తంచేస్తూ జై తెలంగాణ.. నినాదాలతో హోరెత్తించారు. కేసీఆర్‌ను ఎదుర్కోలేకే ఆయన కుటుంబసభ్యులపై అక్రమ కేసులు పెట్టారని, కొంత ఆలస్యమైనా కవిత విషయంలో నిజం, న్యాయమే గెలిచిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌లోని శివనగర్ వద్ద నిర్వహించిన సంబురాల్లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులకు స్వీట్లు తినిపించారు. ఏ ఆధారాలు చూపకుండా అక్రమ కేసులు పెట్టినా కడిగిన ముత్యంలా బయటికి రావడమే కాకుండా రానున్న రోజుల్లో నిజం, ధర్మం గెలిచి ఈ యుద్ధంలో ఆమె విజయం సాధిస్తుందని ఆయన ధీమాగా చెప్పారు. అప్రూవర్‌గా మారాలని ఒత్తిడి చేసినా మొక్కవోని ధైర్యంతో ముందుకు నడిచి బెయిల్ సాధించడం గర్వకారణం అని ప్రశంసించారు. అలాగే ఎనుమాముల మార్కెట్ వద్ద పటాకులు కాల్చి జై తెలంగాణ నినాదాలు చేశారు. హనుమకొండలో వడ్డెపల్లి చర్చి చౌరస్తాలో జరిగిన సంబురాల్లో బీఆర్ఎస్ నేత దాస్యం విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. జనగామ జిల్లా దేవరుప్పలలో జాతీయ రహదారిపై పటాకులు కాల్చి జై కేసీఆర్, జై కవితక్క అంటూ నినాదాలతో హోరెత్తించారు.

భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో పటాకులు కాల్చుతున్న టీబీజీకేఎస్ నాయకులు

- నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 27

కాశిబుగ్గ : ఎనుమాముల మార్కెట్ యార్డు వద్ద పటాకులు కాల్చుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

నయీంనగర్ : వడ్డెపల్లి జంక్షన్‌లో సంబురాలు నిర్వహిస్తున్న దాస్యం విజయ్‌భాస్కర్, నాయకులు

ఒద్దిరాజు సోదరుల సేవలు మరువలేనివి

- ట్యాంక్ బండ్‌పై వారి విగ్రహాల ఏర్పాటుకు కృషి
- ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సుభాష్, టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు అమర్
- ఇనుగుర్తిలో ఘనంగా శతాబ్ది ఉత్సవాలు

మాట్లాడుతున్న చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఒద్దిరాజు సుభాష్

ఇనుగుర్తి, ఆగస్టు 27 : ఒద్దిరాజు సోదరులు సీతారాంచందర్‌రావు, రాఘవరంగారావు సేవలు మరువలేనివని ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఒద్దిరాజు సుభాష్, టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్ అన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఒద్దిరాజు సోదరులు తొలి తెనుగు పత్రికను నెలకొల్పి 102 ఏళ్లు కావడంతో మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ ఒద్దిరాజు సోదరులు కవులుగా, రచయితలుగా, బహుభాషా కోవిదులుగా తెనుగు పత్రికను స్థాపించి రాష్ట్రంలో ఖ్యాతి గడించారని, వారి విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై పెట్టేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఉత్సవాలు ఇనుగుర్తికే పరిమితం కాకుండా హైదరాబాద్ వేదికగా జరగాలని ఆయన ఆకాంక్షించారు. సుభాష్ మాట్లాడుతూ గొప్ప మేధావులైన ఒద్దిరాజు సోదరుల పేర్లను మహబూబాబాద్ జిల్లాకు పెట్టాలని కోరారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు ఏర్పాటు చేసిన మూడు ఆహ్వాన ద్వారాల్లో ఒకటి ఒద్దిరాజు సోదరుల పేరిట ఉందని గుర్తుచేశారు. మాజీ ప్రధాని పీవీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇనుగుర్తికి వచ్చినప్పుడు ఒద్దిరాజు సోదరుల వద్దకు వచ్చి సాష్టాంగ నమస్కారం చేశారంటే వారు ఎంత గొప్పవారో అర్థమైందన్నారు. మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి మాట్లాడుతూ ఒద్దిరాజు సోదరులు తమ గ్రామంలో తెనుగు పత్రికను స్థాపించడం గర్వంగా ఉందన్నారు. జిల్లాలోని సీనియర్ జర్నలిస్టులు బండి సంపత్, వేల్పుల రాజమల్లు, పరకాల రవీందర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి షీల్డులు బహూకరించారు. కార్యక్రమంలో సాంస్కృతిక కళామండలి వరంగల్ కార్యదర్శి వనం లక్ష్మీకాంతరావు, రచయిత మద్దెర్ల రమేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వద్దిరాజు కిషన్, ఒద్దిరాజు ట్రస్ట్ సభ్యులు ఒద్దిరాజు సుభాష్, రాంబాబు, సీతారామచందర్‌రావు, వేణుగోపాల్‌రావు, వినయ్‌బాబు, అనిల్‌కుమార్, సతీశ్, చంద్రప్రకాశ్, కల్యాణ్‌లతో పాటు ప్రముఖులు వద్దిరాజు వెంకన్న పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

- ప్రభుత్వం, ఆర్టీసీ యజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు
- వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

వరంగల్-2 డిపో ఎదుట సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న డ్రైవర్లు, కండక్టర్లు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 27 : ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు వరంగల్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోలు, యూనిట్లలో కార్మికులు ఉదయం నుంచే నల్లబ్యాడ్జీలు ధరించి రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎక్కడికక్కడ ఆయా డిపోల డ్రైవర్లు, కండక్టర్లు, కంట్రోలర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, కార్మికులకు రావాల్సిన రెండు వేతన సవరణలను అమలు చేస్తామని, యూనియన్ల కార్యకలాపాలను పునరుద్ధరిస్తామని, ఆర్టీసీని విస్తరిస్తామని తదితర హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని జేఏసీ నాయకులు మండిపడ్డారు. ఆర్టీసీ యాజమాన్యం చట్టానికి వ్యతిరేకంగా కార్మికులతో 16 గంటలు పని చేయిస్తున్నదని, 2013 వేతన సవరణ బకాయిలు కేవలం డ్రైవర్లకు మాత్రమే చెల్లించి, ఆరు నెలలు గడిచినా మిగిలిన ఉద్యోగులకు వర్తింపజేయలేదని, పదేళ్ల నుంచి సుమారు 13 వేల మంది కార్మికులు వివిధ కారణాలతో వైదొలిగినా ఒక్కరిని కూడా కొత్తగా నియమించకపోవడంతో పనిభారం పెరిగిందన్నారు.

దీంతో పాటు కార్మికులకు నెలకు ఒక్క సెలవు కూడా దొరకని పరిస్థితి నెలకొందని ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యంపై కార్మికులు తీవ్రంగా మండిపడ్డారు.

నల్లబెల్లి మండలం కొండాపూర్‌లో వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ రవీందర్

తండాకు తరలిన వైద్యులు

- కొండాపూర్‌లో జ్వర పీడితులకు పరీక్షలు
- 'నమస్తే' కథనానికి స్పందన

నర్సంపేటరూరల్, ఆగస్టు 27: నల్లబెల్లి మండలం కొండాపూర్‌లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ నెల 27న 'మంచంపట్టిన తండా.. ఆరోగ్య కేంద్రానికి ఆయా భర్తే దిక్కు' శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులను గుర్తించారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో 26 మంది పరీక్షలు చేసినట్లు డాక్టర్లు తెలిపారు. నల్లబెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పోరిక రవీందర్‌నాయక్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నందిగామలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 40 మందికి రక్త పరీక్షలు చేశారు. వీరిలో ఎవరికీ డెంగ్యూ లేదని వైద్యులు నిర్ధారించారు. మరో ఐదుగురు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారని, మందులు అందించామని వైద్యాధికారి తెలిపారు.

1న సబ్ జూనియర్స్ ఖోఖో ఎంపిక పోటీలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 27 : వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ 34వ ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఖో-ఖో ఎంపిక పోటీలను హనుమకొండలోని జేఎన్ఎస్‌లో సెప్టెంబర్ 1న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్ తెలిపారు. 14 సంవత్సరాల్లోపు 3.10.2010న లేదా ఆ తర్వాత జన్మించిన వారు (వయస్సు, హైట్, బరువు 215 పాయింట్లు మించకూడదు) అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు బోనోఫైడ్, బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్‌తో రావాలన్నారు. వివరాలకు 9849210746, 7989203044, 7075615477, 9963336559 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పహాణీ నకల్‌తో రుణమాఫీ చేయాలని ధర్నా

యూనియన్ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ములుగురూరల్, ఆగస్టు27: పహాణీ నకల్‌తో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జంగాలపల్లి గ్రామంలోని యూనియన్ బ్యాంకు ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ ఎండీ అమ్జద్‌పాషా మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఓ మాట ప్రస్తుతం మాట మార్చి రైతులను మోసం చేసేలా వ్యవహరిస్తున్నాడని అన్నారు. రూ. 2 లక్షల లోపు రుణాలన్ని మాఫీ చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 40శాతం మంది రైతులకే మాఫీ చేసిందని తెలిపారు. రైతులను మభ్య పెట్టే రీతిలో అధికార పార్టీ నాయకులు ప్రవర్తిస్తున్నారని, 100 శాతం రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జంగాలపల్లి యూనియన్ బ్యాంకు పరిధిలో గిరిజన రైతులు పహాణీ నకల్ ఆధారంగా రుణాలు తీసుకుంటారని, వారందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని అన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున రైతులను సమీకరించి సమరశీల పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు రాజిరెడ్డి, రఘు, రహీంపాషా, సమ్మయ్య, శాంతమ్మ, లింగుస్వామి, లక్ష్మీ, రమేశ్, కుమారస్వామి, నారాయణ, నర్సయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

రుణమాఫీ టోకెన్ల కోసం తోపులాట

కిందపడ్డ కొందరు రైతులు

నర్సింహులపేట ఎస్‌బీఐ వద్ద గుమిగూడిన రైతులు

నర్సింహులపేట, ఆగస్టు 27: నర్సింహులపేట మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో రుణమాఫీ కోసం వచ్చిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. మూడు రోజులుగా సెలవు కావడంతో మంగళవారం బ్యాంకు తెరువక ముందే వివిధ గ్రామాల నుంచి రైతులు వచ్చారు. తీరా 10 గంటలకు షెట్టర్ తీయడంతో రైతులు ఒక్కసారిగా లోపలకు తోసుకురావడంతో కొంత మంది కిందపడ్డారు. అనంతరం క్యూలో నిల్చున్న 100 మంది రైతులకు టోకెన్లు అందించారు. టోకెన్లు రాని రైతులు వెనుదిగారు.

• రైతు నేస్తాలు డ్రోన్లు

నాబార్డ్ సీజీఎం సుశీల, టెస్కాబ్ చైర్మన్ మార్నేని

డ్రోన్‌ను ప్రారంభిస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని, సీజీఎం

ఐనవోలు, ఆగస్టు 27: రైతు నేస్తంగా డ్రోన్స్ మారుతున్నాయని, వ్యవసాయ ఆధునీకరణలో ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయని నాబార్డ్ సీజీఎం సుశీల చింతల అన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్‌లోని ఐనవోలు, హసన్‌పర్తి, నెక్కొండ, జఫర్‌గఢ్, నేలమ్మ జనగామ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు వ్యవసాయ డ్రోన్ల పంపిణీ పైలట్ ప్రా జెక్టులో భాగంగా వ్యవసాయ డ్రోన్ పంపిణీ, ప్రారంభోత్సవ కార్యక్రమం మండలంలోని రాంనగర్ రైతు వేదికలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాబార్డ్ సీజీఎంతోపాటు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డీజీఎం స్వాతి తివారీ హాజరయ్యారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు వ్యవసాయ డ్రోన్ల పంపిణీ చేశారు. అదేవిధంగా నందనం సొసైటీకి విచ్చేసిన సీజీఎంకు పాలక వర్గ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం బ్యాంక్ ఆవరణలో మొబైల్ ఏటీఎంను ఆమె ప్రారంభించారు. కార్నెల్ సద్గురు ఫౌండేషన్ డైరెక్టర్ హేమలత విజయరాఘవన్, ఆర్ఏఆర్ ఎస్ ఉమారెడ్డి పాల్గొన్నారు.